పేదల ఆరోగ్యానికి భరోసా

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- విస్తృతం అవుతున్న సేవలు



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. ప్రజలు నివసించే ప్రాంతంలోనే వాటిని ఏర్పాటు చేసి వాటి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. వ్యాక్సిన్లు వంటి వాటితో పాటు కుక్క, పాము కాటు, తేలు కుట్టటం వంటి వాటికి కూడా అక్కడే ఇంజక్షన్‌లు చేసే సదుపాయాన్ని కల్పించింది. దీంతో ప్రజలు వాటి సేవలను మరింత ఉపయోగించుకుంటున్నారు.

- తెనాలి పట్టణంలోని నందులపేట, నాజరుపేట, బుర్రిపాలెం రోడ్డు, కొత్తపేట వంటి ప్రాంతాలలో నివసించే పేద ప్రజలకు అనారోగ్యం వస్తే వారు చెంచుపేటలోని జిల్లా వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలు నివసించే ప్రాంతంలోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.కోటి నిధులతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గతేడాది ఫిబ్రవరి 8వ తేదీ నుంచి దాని సేవలు ప్రారంభమయ్యాయి.



పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

పెరిగిన ఓపీల సంఖ్య..

పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నేడు రోజుకు 50 నుంచి 70 మంది వరకు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ఏడాదికి సుమారు 12,650 మంది వైద్య సేవలు పొందుతున్నారు. అంతేకాకుండా రక్త, మూత్ర, కళ్ళ పరీక్షలను నెలకు సుమారు 350 మంది చేయించుకుంటున్నారు.

అభా యాప్‌లో సేవల వివరాలు..

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందే వారికి అభా (ఆయుష్మాన్ భారత్) యాప్‌లో పేర్లు నమోదు చేయిస్తారు. అంతేకాకుండా వారి అనారోగ్య వివరాలు పొందుపరచి, వైద్యశాలకు వచ్చిన ప్రతి సారి వారికి అందించే వైద్య సేవలు, పరీక్షల వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. దీంతో ఆ రోగి ఇతర వైద్యశాలలకు వెళ్లినా యాప్‌ను ఓపెన్ చేస్తే అతడి అనారోగ్యానికి సంబంధించిన వివరాలు ఉండటం వల్ల వెంటనే వైద్య సేవలు అందించే వెసులుబాటు కలుగుతుంది.


రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు

విస్తృతమైన అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు..

అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని ఫీల్డ్ వర్కు చేసేందుకు ఒక హెల్త్ విజిటర్, ఎనిమిది మంది ఏఎన్ఎంలు, పది మంది ఆశా వర్కర్స్ ఉంటారు. వారిని హెల్త్ సెంటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, మదర్‌సాలకు పంపి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తుంటారు. బాలికలకు రక్త హీనతను తగ్గించే మందులు పంపిణీ చేస్తుంటారు. అంతే కాకుండా వార్డులలోని ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో టీకాలు వేయించటం వంటివి చేస్తుంటారు.

అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను ఉపయోగించుకోండి..



డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అనేక రకాల వైద్య సేవలు అందించటం జరుగుతుంది. షుగర్, బీపీ, ఇతర 63 రకాల పరీక్షలు ఇక్కడ చేస్తున్నాం. ఇవి కాకుండా ఇక్కడ ఆక్సిజన్ సదుపాయం కూడా ఉంది. వార్డులో గర్భిణులకు, బాలింతలకు కూడా సేవలు అందిస్తున్నాం. ఈ ప్రాంత ప్రజలు అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను ఉపయోగించుకోండి.

–డాక్టర్ బీబీజాన్, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

రవాణా ఖర్చులతో పాటు సమయం ఆదా అవుతుంది..



నేను ఏడాది నుంచి బీపీ పరీక్షలు ఇక్కడే చేయించుకుని మందులు తీసుకుంటున్నాను. గతంలో ఏదైనా చిన్న అనారోగ్యం వస్తే చెంచుపేటలోని జిల్లా వైద్యశాలలో చూపించుకోవాల్సి వచ్చేది. దానికోసం రూ.200 ప్రయాణ ఖర్చులు వెచ్చించాల్సి వచ్చేది. కానీ నేడు సీఎం జగన్ అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయటం వల్ల మా ప్రాంతంలోనే ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడింది. దీనివల్ల రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతుంది.

– సయ్యద్ కరిమున్నీసా, నందులపేట, తెనాలి

అర్బన్ హెల్త్ సెంటర్‌లో సేవలు బాగున్నాయి..



నాకు షుగర్ ఉంది. రెండు, మూడు నెలలకు ఒకసారి ఇక్కడకు వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటూ ఉంటాను. ఏడాది నుంచి ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నాను. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది చక్కగా మాట్లాడి సేవలు అందిస్తున్నారు. వీరి సేవలు బాగున్నాయి. అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– సీహెచ్ అనిత, నందులపేట, తెనాలి.

కొల్లిపరలో సీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం

- ఊరూరా అధునాతన ఆసుపత్రుల నిర్మాణం
- స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది నియామకంతో మెరుగైన వైద్యసేవలు
- రూ.8.72 కోట్లతో 30 పడకల సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా సమక్షంలో ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పేదలకు సంక్షేమంతో ఆర్థిక ఆసరా కల్పించటమే నిజమైన అభివృద్ధిగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కొల్లిపరలో రూ.8.72 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ఈ వేడుకలో పాల్గొన్నారు. బహిరంగ సభకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గతంలో డాక్టర్లు, సిబ్బంది, టెస్టింగ్ పరికరాలు, టెక్నీషియన్లతో సహా అన్నింటికీ ఆసుపత్రుల్లో కొరత ఉండేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులతో సహా 57 వేల పోస్టులను భర్తీ చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే ఆయన ఆశయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స ఖర్చును రూ.25 లక్షలకు పెంపుదల చేశారని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణాల్లో పట్టణ ఆరోగ్యకేంద్రాలను నిర్మిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే కొల్లిపరలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేట్ స్థాయిలో నిర్మించినట్టు తెలిపారు. ప్రజల మెరుగైన జీవనం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని కోరారు.

- మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అధునాతన సౌకర్యాలతో కూడిన వైద్యశాలను కొల్లిపర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ, విద్యాలయాలు, వైద్యాలయాలు, సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకేల నిర్మాణం గ్రామ స్వరాజ్యానికి నిజమైన నిదర్శనమన్నారు.
- ప్రముఖ గుండెవ్యాధుల నిపుణుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స చేయించుకున్న రోగులకు ఆసరా పేరుతో ఆర్థికసాయం చేయటం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. జగనన్న సురక్ష పథకం, ఫ్యామిలీ డాక్టర్ విధానం, టెలీమెడిసిన్ గొప్ప కార్యక్రమాలని చెప్పారు. ప్రభుత్వం అనుమతిస్తే నెలకోసారి ఇక్కడకొచ్చి ఉచిత వైద్యసేవలను అందిస్తానని చెప్పారు.
- హెల్త్ సర్వీసెస్ జిల్లా కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్యరంగానికి విశేష ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుజాత లక్ష్మి స్వాగతం పలికారు. ఎంపీపీ భీమవరపు పద్మావతిసంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీలు సీహెచ్ ఝాన్సీ, కేసన శ్రీలత మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కేసన సీతమ్మ, ఎంపీడీవో వై.విష్ణుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, జొన్నల శివారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, అవుతు నగేష్ రెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, బేతాళ భూషణం, ఆరెమండ శివరామకృష్ణారెడ్డి, కల్లం వీరారెడ్డి, స్థలదాత కుటుంబసభ్యులు రవీంద్రరెడ్డి, శ్రీధర్ ప్రసాద్, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధి శ్రీకాంత్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొల్లిపరలో 'బ్రాహ్మణ భవన్' ప్రారంభం


ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో ప్రారంభిస్తున్న శ్రీకాంత్

తెనాలి: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచనతో కొల్లిపర గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి సహకారంతో కొల్లిపర మండల బ్రాహ్మణ ఐక్యవేదికకు ఓ భవనం సమకూరింది. కొల్లిపర ప్రధాన రోడ్డులో శివాలయం పక్కన గతంలో కచేరికోసం దాతలు ఇచ్చిన స్థలం, అందులోని భవనాన్ని ఐక్యవేదికకు అందజేశారు. బ్రాహ్మణ భవన్‌గా నామకరణం చేయగా, ఆదివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో దేవదాయ, ధర్మదాయ శాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ప్రారంభించారు. బ్రాహ్మణ పరిషత్, తెనాలి ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ అభ్యర్థనతో ఎమ్మెల్యే శివకుమార్ చొరవ తీసుకోవటంతో దాదాపు నాలుగు సెంట్ల స్థలంలో ఉన్న పాత భవనంతో సహా ఐక్యవేదికకు అందజేశారు. ఐక్యవేదిక నాయకులు పోగుల రామలింగేశ్వర శర్మ, పరాశరం జగన్నాథాచార్యులు, కల్వకొల్లు వీరభద్రేశ్వరరావు, పోతురాజు రాంబాబు, ఉరిత సూర్యనారాయణ శాస్త్రి, చల్లా కోదండరామ శర్మ, బ్రాహ్మణ పరిషత్ తెనాలి నాయకులు పురుషోత్తమ శర్మ, పరాశరం వెంకట రామగోపాల్, తెనాలి డివిజన్ ఆర్‌ఎంపీల అసోసియేషన్ డాక్టర్ నారాయణం వేణుగోపాల్, లక్కరాజు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శివకుమార్‌కు, కొల్లిపర ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

యువ వ్యాపార వ్యవస్థాపక సదస్సుకు స్పందన

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు సొంతంగా వ్యాపారాలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో వ్యాపారాలు స్థాపించిన వారు పెద్దసంఖ్యలో రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకులు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ మాట్లాడుతూ ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సౌకర్యాలకు నాంది కేఎల్‌యూ అని తెలిపారు. నూతన వ్యాపారాలను స్థాపించాలనుకునే వారికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శ్రీకావ్య, అసిస్టెంట్ డైరెక్టర్ సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాల సమీపంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. అతని వద్ద 30 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన చిలకా యలమందగా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. గ్రామంలో అధిక ధరకు మద్యం విక్రయించేందుకు తీసుకువెళుతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.

బంద్, సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీ టు ప్లస్ 50 శాతం మద్దతు ధరలను పార్లమెంటులో ఆమోదించేందుకు చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, నాలుగుగా మార్చడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీఐటీయూ నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల అధ్యక్షురాలు కారసాల స్వాతి పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు

భక్తులనుద్దేశించి ప్రవచనం చేసిన వెంకటేశ్వర యోగి గురూజీ


పూర్ణాహుతిని నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

తెనాలిటౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీవిద్యాపీఠం, సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో జరుగుతున్న వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పూజ్యశ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో ఉదయం తిరుమల వేద పండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. స్వామివారి విశిష్టతను తెలియజేశారు. స్వామివారి ఏడుకొండలు మానవ శరీరంలో ఉండే ఏడు చక్రాలకు ప్రతీకలని అన్నారు. వేంకటేశ్వరుడు పాపాలను పోగొట్టే దైవమని, కలియుగంలో మానవులకు కొంగు బంగారమన్నారు. తెనాలిలో నిర్వహించిన స్వామివారి వైభోత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు. బొచంపల్లి సతోష్‌కుమార్‌శాస్త్రి స్వామి వారి విశిష్టతను వివరించారు. సౌభాగ్య భువనేశ్వరి పీఠం వ్యవస్థాపకులు రామానంద భారతిస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పూజ్య శ్రీ బాలస్వామీజీ ఉదయం శ్రీనివాసునికి విశేష పూజలు జరిపారు. రాత్రికి పుష్పయాగం, శ్రీనివాసుని కల్యాణం జరిపించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని మఠం ట్రస్టు చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. శ్రీవిద్యాపీఠం, సాలిగ్రామమఠం, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తుది దశలో సామాజిక పింఛన్ల పంపిణీ


బషీర్ ఉన్నీస్సాకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేష్


విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకాయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుదీప


తులశమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గోపికృష్ణ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చివరి దశకు చేరింది. ఆదివారం ఉదయం అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించి వారికి వార్డు వలంటీర్‌లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు పింఛన్ పంపిణీ చేశారు. ఎన్‌వీఆర్ కాలనీకి చెందిన తాళ్లూరు వెంకాయమ్మకు చెయ్యి విరగడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ కారుమంచి సుదీప అక్కడకు వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు. అలాగే చెంచుపేటకు చెందిన తుమ్మ తులశమ్మకు వృద్ధాప్య పింఛన్ వలంటీర్ గోపికృష్ణ పంపిణీ చేశారు. షేక్ బషీర్ ఉన్నీస్సాకు వితంతు పింఛన్ వలంటీర్ సోమ వెంకటేష్, గంగానమ్మపేటకు చెందిన ఆలమూరి శ్రీనివాసరావుకు వికలాంగ పింఛన్ వలంటీర్ ఉషారాణి పంపిణీ చేశారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

మంగళగిరి: పట్టణంలోని మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తీసుకున్న 60 మంది విద్యార్థులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు.

క్రీడాకారులకు అభినందనలు

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయికి ఎంపికై, వివిధ కేటగిరీల్లో గెలుపొందిన క్రీడాకారులను వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. క్రీడాకారులంతా రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవలు

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ప్రజలకు విస్తృతంగా సేవలు అందించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల కృత్రిమ చేతుల పంపిణీ చేసి ఎంతో మంది పేదలకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అండగా నిలిచింది. ఈ నేపథ్యంలో మంగళకరం పేరుతో ప్రోస్టటిక్ హ్యాండ్ నూతన ప్రాజెక్ట్ ప్రమోషన్ వాల్‌పోస్టర్లను ఆదివారం గవర్నర్ డాక్టర్ వడ్లమాని రవి ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టును దేశంలో తొలిసారిగా మంగళగిరిలో ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఇనునూరి చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, అందే మురళీ మోహన్, పారేపల్లి నిరంజన్‌గుప్తా, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ సహకారంతో చినరావూరులోని సత్యనారాయణ పార్కులో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. కొత్తమాసు కుమార్ పార్కులో ఏర్పాటు చేసేందుకు పెద్ద సంఖ్యలో మొక్కలను అందజేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోటరఘురామ్, గుంటూరు గోపి, తాడిబోయిన రమేష్, మున్సిపల్ ఆర్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, వాకర్స్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

8న కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ 'రచ్చబండ'

పాల్గొంటున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

తెనాలిటౌన్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గుంటూరు జిల్లా పర్యటన సందర్భంగా ఈ నెల 8వ తేదీన రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. కొలకలూరులో ఉదయం 10 గంటలకు జరిగే రచ్చబండలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని, వారితో షర్మిల మాట్లాడతారని చెప్పారు. అనంతరం బాపట్ల పర్యటనకు వెళతారన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సయ్యద్ జాకీర్ హుస్సేన్, నాయకులు షేక్ చాంద్‌బాషా, ఆరుమళ్ళ సురేష్, అక్కిదాసు జాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్కరాజు సాయికి సాహితీరత్న బిరుదు



తెనాలిటౌన్: సాహిత్యకారుడు, స్వరలయ సంస్థ అధ్యక్షులు లక్కరాజు సాయికి సాహితీ రత్న బిరుదును ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ స్వరలయ ద్వారా 500 కార్యక్రమాలు నిర్వహించి సంస్థకు గుర్తింపు తెచ్చారని కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ తమను సత్కరించడం పూర్వజన్మ సుకృతమని సాయి తెలిపారు. ఈ సందర్భంగా సాయిని శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, కోశాధికారి హృదయరాజు, గరికపాటి సుబ్బారావు, అసోసియేసన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తాడేపల్లి రూరల్ : పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేష్‌రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బొక్కా ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది తలసేమియా వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం చేశారు. రక్తదానం చేసిన వారికి ఐశ్వర్య ఫౌండేషన్ తరపున ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, వందేమాతరం హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ సుభాని, అంజిరెడ్డి, కరీం పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై వెలిసిన కార్మెల్ మాతను ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉదయాన్నే వాహనాలు, రైలులో వచ్చిన పలువురు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాత ముందు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.